నమస్తే తెలంగాణ
# నల్లగొండ
3 | నల్లగొండ, సోమవారం 7 అక్టోబర్ 2024 | NALGONDA



నేరేడుచర్ల : కలశాలకు పూజలు నిర్వహిస్తున్న పండితులు

## కనుల పండువగా మహా కుంభాభిషేకం

నేరేడుచర్ల, అక్టోబర్ 6 : దేవీ శరన్నవరాత్రోత్స వాలు, ఆలయం 12వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నేరేడుచర్ల విజయదుర్గా ఆలయంలో మహా కుంభాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలశాలతో మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో మేళతాళాల మధ్య ఊరేగింపు ఆల యానికి తీసుకొచ్చారు. అనంతరం ఆలయంలో కలశాలను ఆలయ పూజారి మొలుగు శ్రీనివాసాచా ర్యుల ఆధ్వర్యంలో వేద పండితులు పూజలు నిర్వ హించారు. ఆలయ శిఖరం నుంచి అమ్మవారికి మహా కుంభాభిషేకం చేశారు. జై దుర్గామాత నినా దాలతో ఆ ప్రాంతం మార్మోగింది. నవరాత్రి ఉత్స వాల్లో భాగంగా నాల్గో రోజు అమ్మవారిని లలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు.

## కాళేశ్వరం జలాల పరవళ్లు

- అలుగు దుంకుతున్న చెరువులు, చెక్‌డ్యామ్‌లు



రాజాపేట మండలంలోని కాల్వపల్లిలో జలకళ సంతరించుకున్న చెక్‌డ్యామ్

రాజాపేట, అక్టోబర్ 4 : కరువు నేలపై కాళే శ్వరం జలాలు గలగలా పరుగులు పెడుతు న్నాయి. కాళేశ్వరం నీళ్లను విడుదల చేయ డంతో తుర్కపల్లి మండలంలోని గంధమల్ల చెరువు నిండి అలుగు పోస్తున్నది. గంధమల్ల చెరువు నుంచి వాగుగుండా బేగంపేట, పొట్టి మర్రి, కొలనుపాక మీదుగా ఆలేరు వాగుకు కాళేశ్వరం నీళ్లు తాకి దిగువకు పారుతు న్నాయి. రాజాపేట చల్లూరు, కాల్వపల్లి, రఘునాథపురంలో నిర్మించిన చెక్‌డ్యామ్‌లు జలకళ సంతరించుకున్నాయి. రఘునాథపు రంలోని పొల్కంకుంట, లచ్చమ్మకుంటతోపాటు యాదగిరిగుట్ట మండలంలోని గౌరాయపల్లి చెరువు, దాని దిగువన ఉన్న మరిన్ని గొలుసుకొట్టు చెరు వులు నిండుతున్నాయి.

# ధాన్యం కొనుగోళ్లపై సందిగ్ధం

### నేడు రేపు అంటూ గడుపుతున్న యంత్రాంగం



నల్లగొండలోని ఆర్జాలబావి కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం

- పలు కేంద్రాలకు ఇప్పటికే ధాన్యం తీసుకొచ్చి ఎదురుచూస్తున్న రైతులు
- సన్న, దొడ్డు రకం ధాన్యానికి వేర్వురుగా కేంద్రాల ఏర్పాటులో అధికారులు
- పలు రకాల ధాన్యాన్ని ఎలా గుర్తిస్తారని అన్నదాతల్లో ఆందోళన
- ప్రభుత్వం సన్నాలకు క్వింటాకు రూ.500 ఎక్కువ ఇచ్చినా.. మిల్లుల్లో అంతకు మించి ధర రాక
- ఉమ్మడి జిల్లాలో 965 కేంద్రాల ఏర్పాటుకు చర్యలు..
- 29.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం

వానకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్ల ప్రారంభంపై సందిగ్ధం నెలకొంది. ఇవ్వాళ, రేపు అంటూ గడుపుతున్న అధికార యంత్రాంగం తీరుతో రైతుల్లో అసహనం వ్యక్తమవుతున్నది. ఇప్పటికే జిల్లాలో ఆయా కేంద్రాల్లో ధాన్యం పోసిన రైతులు కొనుగోలు చేయాలని ఎదురు చూస్తున్నప్పటికీ కేంద్రాలు ప్రారంభించకపోవ డంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సన్నాలకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ.500బోనస్ ఇస్తామని ప్రకటిం చడంతో సన్నాలు, దొడ్ల కోసం వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటు చేసే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. సన్నాలు, దొడ్లు గుర్తించే పని వ్యవసాయ యంత్రాంగానికి పని అప్పగించగా, ఎలా గుర్తిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఉమ్మడి నల్ల గొండ జిల్లాలో 11.77 లక్షల ఎకరాల్లో వరి ధాన్యం సాగు కాగా ఆయా జిల్లాల్లో 29.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కానున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో సన్నాలు 9.86 లక్షల మెట్రిక్ టన్నులు, దొడ్డు ధాన్యం 20 లక్షల మెట్రిక్ టన్నులు రానుంది. వీటి కొనుగోలుకు ఐకేపీ, పీఏసీఎస్, మార్కె టింగ్ శాఖల ఆధ్వర్యంలో 965 కేంద్రాలు ప్రారంభించ నున్నామని ప్రకటించిన అధికార యంత్రాంగం ఇప్పటి వరకు చేయకపోవడం గమనార్హం.

– నల్లగొండ, అక్టోబర్ 6

### సన్నాల గుర్తింపుపై ఆందోళన

సన్న ధాన్యానికి క్వింటాకు రూ.500 ఇస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో అసలు సన్నాలు ఎలా గుర్తిస్తారనే దానిపై అన్నదాతలు ఆందోళనలో పడ్డారు. ప్రభుత్వం మొత్తంగా 33 రకాలకు సంబం ధించి సన్నాలకు అనుమతి ఇచ్చింది. దీనికి సంబంధించి తెప్పించిన రెండు మిషన్లతో క్యాలిబర్ చేయనున్నారు. ఈ మిషన్ ఆధా రంగా ధాన్యం పొడవు, మందం ఆధా రంగా సన్నాలా, దొడ్లా అనేది గుర్తిం చనున్నారు. ఇందుకోసం వేర్వేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇది ఎలా ఉంట దనేది చూడాల్సి ఉంది. ఈ మిషన్ ఆధా రంగా సన్నాలు అని తేలితే రూ.55 బోనస్ క్వింటాకు రానుండగా.. దొడ్లు అయితే గ్రేడ్–1 లేదా సాధారణ రకంగా గుర్తించనున్నారు.

### మిల్లుల్లో అంతకు మించి ధర

ప్రభుత్వం ఈ సారి సన్నాలకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తా మని ప్రకటించినప్పటికీ మిల్లుల్లో అంతకు మించి ధర వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. సాధార ణంగా 17శాతం తేమ ఉంటేనే మార్కె ట్‌లో ధాన్యం కొనుగోలు చేస్తారు. మిల్లుల్లో 25 నుంచి 30శాతం తేమ ఉన్నప్పటికీ ప్రస్తుతం క్వింటాకు రూ.2,800 నుంచి రూ.2,900 వరకు కొనుగోలు చేస్తున్నట్లు రైతులు అంటున్నారు. ధాన్యం ఆరబోస్తే తేమ శాతం తగ్గి నష్టం వస్తున్నందున ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చినా ఉపయోగం ఏం లేదన్న వాదన వస్తు న్నది. ధాన్యం గుర్తింపు విషయంలో ఎలా ఉంటుందనే దానిపై సందిగ్ధం నెలకొంది.

### ఏటా అక్టోబర్ 1 నుంచే ప్రారంభం

సాధారణంగా ఏటా అక్టోబర్ 1 నుంచే వానకాలం సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తారు. ఈ సారి మొదటి వారం పూర్తవుతున్నప్పటికీ నేడు, రేపు అని అధికార యంత్రాంగం కాలయాపన చేస్తున్నది. దాంతో కేంద్రాలకు ఇప్ప టికే ధాన్యం తీసుకొచ్చిన రైతులు ధాన్యం ఎప్పుడు కొనుగోలు చేస్తారని ప్రశ్నిస్తున్నారు. ఈ సారి మద్దతు ధర క్వింటాకు గ్రేడ్–1 రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 నిర్ణయించగా.. సన్నాలకు మరో రూ.500 అదనంగా ఇవ్వనున్నారు. సన్నాలు, దొడ్లకు వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటు చేసే యోచనలో అధికార యంత్రాంగం ఉండగా.. అవి ఎక్కడెక్కడ ప్రారంభించాలో క్లారిటీ లేకుండా పోయింది.

### ఉమ్మడి జిల్లాలో 9.86 లక్షల మెట్రిక్ టన్నుల సన్నాలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 11.77 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా 29.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి ఆయా ప్రాంతాల్లో 9.86 లక్షల ఎకరాల్లో సన్నాలు, 20 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉంది. నల్లగొండ జిల్లాలో 5.15 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా 12 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రానుంది. ఇందులో ఏడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సన్నాలు రానుండగా ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దొడ్డు ఉండ నుంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో 2.82 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా 6.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సన్నాలు 70వేల మెట్రిక్ టన్నులు, దొడ్డు రకం 5.70 లక్షల మెట్రిక్ టన్నులు కేంద్రాలకు రానుంది. సూర్యాపేట జిల్లాలో 4.82 లక్షల ఎకరాల వరి సాగు కాగా 11 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రానున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో 2.16 మెట్రిక్ టన్నుల సన్నాలు, 9లక్షల మెట్రిక్ టన్నుల దొడ్లు రానున్నాయి.

### మిషన్ల ద్వారానే సన్న ధాన్యం గుర్తింపు

జిల్లాలో ఈ వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నాం. సన్న, దొడ్డు ధాన్యం కోసం వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఆయా కేంద్రాల్లో సన్నాలు గుర్తించేందుకు ప్రత్యేకంగా మిషన్లు అందుబాటులో ఉంచాం. ఆయా మిషన్ల ద్వారా పొడవు, మందం బట్టి సన్నాలా, దొడ్లా అనేది గుర్తించవచ్చు. రైతులు ఆరబె ట్టిన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలి.

**-పాల్వాయి శ్రవణ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి, నల్లగొండ**



ఉంద్రుగొండ చారిత్రక కట్టడాలను పరిశీలిస్తున్న పటేల్ రమేశ్ రెడ్డి

## ఉంద్రుగొండను టూరిజం స్పాట్‌గా మారుస్తాం

- ఉంద్రుగొండ అభివృద్ధికి రూ 2.5 కోట్లు మంజూరు
- రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి

చివ్వెంల, అక్టోబర్ 6 : ఉంద్రుగొండను రాష్ట్రంలో నంబర్ వన్ టూరిజం స్పాట్‌గా మారు స్తామని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి అన్నారు. చివ్వెంల మండల పరి ధిలోని ఉంద్రుగొండ గుట్టపై లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని ఆదివారం ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కొండపై చారిత్రక కట్టడాలను పరి శీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉంద్రుగొండ గిరిదుర్గం అత్యంత ప్రాచుర్యం కలి గిందని, ఇక్కడి ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం ద్వారా పర్యాటకుల తాకిడి పెరుగుతుందని తెలి పారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు రూ.2.5 కోట్లు నిధులు మంజూరు చేశామని, త్వరలోనే పను లకు శ్రీకారం చుట్టనున్నట్లు చెప్పారు. ఉంద్రుగొండ సందర్శనకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచిం చారు. అంతకుముందు ఆలయ కమిటీ ఆధ్వ ర్యంలో ఆయనకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆదుర్తి రామయ్య, చైర్మన్ చకిలం కృష్ణకుమార్, అర్చకులు కృష్ణమాచార్యులు, కమిటీ సభ్యులు బందకవి కృష్ణమోహన్, మురళీ కృష్ణ, మధుసూదన్‌రావు, శ్రీరాములు, శ్రీనివాస్, శంకర్, హర్ష పాల్గొన్నారు.

## చిట్యాలలో నేడు రైతు ధర్నా

- హాజరుకానున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

చిట్యాల, అక్టోబర్ 6 : కాంగ్రెస్ ఎన్నికల సమ యంలో రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం చిట్యాల తాసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు ధర్నా నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ పట్టణ అధ్య క్షుడు పొన్నం లక్ష్మయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కార్యక్రమంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీ శ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొ ననున్నట్లు పేర్కొన్నారు. ధర్నాలో రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనా లని ఆయన కోరారు.

# 'బొమ్మలరామారం'లో అక్రమ రిజిస్ట్రేషన్లు..!

- ఇద్దరు కొడుకులుంటే ఒక్కరికే కట్టబెట్టిన వైనం
- భూమిపై వివాదం ఉన్నా.. బైండోవర్లు చేసినా..
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- న్యాయం కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- గతంలోనూ మర్యాలలో ఇదే తరహా భూ రిజిస్ట్రేషన్

### ఇష్టారాజ్యంగా భూముల బదలాయింపు
### తల్లి పేరుపై ఉన్న భూమి ఏకపక్షంగా గిఫ్ట్ డీడ్

**బొమ్మలరామారం తాసీల్దార్ కార్యాలయం అక్రమ భూ రిజిస్ట్రేషన్లకు అడ్డాగా మారింది. ఆస్తులను ఏకప క్షంగా ఇష్టారాజ్యంగా కట్టబెడుతున్నారు. చేతులు తడిపితే చాలు అడ్డగోలుగా భూములను రిజిస్ట్రేషన్లు చేస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇందుకు ఉదాహరణే మర్యాల గ్రామంలోని ఓ అక్రమ రిజిస్ట్రేషన్. తల్లి పేరు మీద ఉన్న భూమిని రెండో కొడుకుకు తెలియకుండానే.. మొత్తానికి మొత్తంగా పెద్ద కొడుకుకు భూమి రిజిస్ట్రేషన్ చేయడం వివాదా స్పదంగా మారింది. భూమిపై గతంలోనే వివాదం నడుస్తున్నా.. విషయం రెవెన్యూ అధికారులకు తెలిసినా రిజిస్ట్రేషన్ చేయడంపై అనుమానాలకు తావిస్తున్నది. గతంలోనూ ఇదే తరహా రిజిస్ట్రేషన్ జరి గిన దాఖలాలు ఉన్నాయి.**

– యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ)

బొమ్మలరామారం మండలంలోని మర్యాల గ్రామానికి చెందిన బండ ఎల్లమ్మ, ఎల్లయ్య దంపతు లకు ఇద్దరు కుమారులు. ఎల్లయ్య కొంత కాలం కింద మరణించాడు. పెద్ద కుమారుడు బండ చెన్నయ్య, చిన్న కుమారుడు బండ శ్రీశైలం. ఇద్దరు వ్యవసాయం చేసు కుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎల్లయ్య బతికి ఉన్న ప్పుడు వారసత్వంగా వస్తున్న సొంత భూమిని అమ్మి అదే గ్రామంలోని సర్వే నంబర్ 583/అలో 2 ఎకరాల 12 గంటలు, 613/అలో ఒక ఎకరం 4గంటల భూమిని కొనుగోలు చేసి.. ఎల్లమ పేరుపై పట్టా చేయిం చారు. రెండు సర్వే నంబర్లలో కలిపి 3 ఎకరాల 16గుంటల భూమి ఎల్లమ్మ పేరుపై ఉంది. ఆ భూమిలో అన్నదమ్ములు ఇద్దరు సమభాగాలు పంచు కొని.. కబ్జాలోకి ఉండి కొన్నేండ్లుగా వ్యవసాయం చేసుకుంటున్నారు. ఇంత వరకు బాగానే ఉంది. కానీ ఇద్దరు కొడుకులకు సమానంగా రావాల్సిన ఆస్తిని రెవెన్యూ అధికారులు ఏకపక్షంగా ఒక్క కుమారుడికే కట్టబెట్టారు. చిన్న కుమారుడికి తెలియకుండా, ఎలాంటి కన్సెంట్ తీసుకోకుండా పెద్ద కుమారుడి పేరుపై ఈ ఏడాది మే 3న రెవెన్యూ అధికారులు 546/2024 నంబర్‌తో గిఫ్ట్ డీడ్ చేశారు.



తాసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బాధితుడు

### వివాదం ఉన్నా..

ఇటీవల కాలంలో భూముల పంపకాల విషయంలో ఇద్దరు అన్నదమ్ముల మధ్య గొడలు షురూ అయ్యాయి. తరుచూ పొలం వద్ద ఘర్షణలు చోటుచేసుకు నేవి. భౌతికంగా దాడులు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఈ క్రమంలోనే బొమ్మలరామారం పోలీస్ స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఇద్ద రినీ తాసీల్దార్ శ్రీనివాస్ రావు ఎదుట రెండు సార్లు బైండోవర్ చేశారు. ఈ భూమి వివాదం గురించి తాసీల్దార్ దృష్టిలో ఉంది. వివాదంలో ఉన్నా, బైండోవర్ చేసినా ఏక పక్షంగా ఒక్కరి పేరు మీదనే రిజిస్ట్రేషన్ చేయడంలో మతలబు ఏంటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. బైండోవర్ చేసిన నేపథ్యంలో అన్నదమ్ములు ఇద్దరు అంగీ కార పత్రం సమర్పిస్తేనే పట్టా చేయాలనే నిబంధనలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

### ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా..

రిజిస్ట్రేషన్ విషయం ఆలస్యంగా బయటకు రావ డంతో చిన్న కుమాడు లబోదిబోమంటున్నాడు. తాసీల్దా ర్‌ను కలిసి తన గోడున వెల్లబోసుకున్నా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఇద్దరం కొడుకులం ఉంటే ఒక్కరికే ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారని కలెక్టరేట్‌లో ప్రజావా ణిలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ అంశంపై రిపోర్ట్ ఇవ్వాలని కలెక్టర్ రెవెన్యూ అధికారు లను ఆదేశించారు. అయినప్పటికీ ఎలాంటి న్యాయం జరుగలేదని బాధితుడు వాపోతున్నాడు. ఇదే విషయ మపై బొమ్మలరామారం తాహసీల్దార్ శ్రీనివాస్‌రావును ఫోన్‌లో వివరణ కోరగా, ఈ అంశంపై తనకు ఐడియా లేదని దాటవేసే ప్రయత్నం చేయడం కొసమెరుపు. కాగా గతంలో మర్యాల గ్రామంలో ఓ వృద్ధురాలికి ముగ్గురుకు కొడుకులు ఉండగా, ఇద్దరికే రిజిస్ట్రేషన్ చేశారు. అప్పట్లో అది వివాదాస్పదం కావడంతో ఆ తర్వాత ముగ్గురు ఏక తాటిపైకి వచ్చి సమానంగా పంచుకున్నారు.

### నా వాటా నాకు ఇప్పించండి..



మా అమ్మకు ఇద్దరం కొడుకులం. ఒక్కరి పైనే ఎట్లా రిజిస్ట్రేషన్ చేస్తారు. తాసీల్దార్‌ను అడిగితే నేను అలానే చేస్తాను.. ఏం చేస్తావో చేసుకో పో.. లేదంటే కోర్టుకు వెళ్లమని బెదిరించాడు. కలెక్టర్ రిపోర్ట్ ఇవ్వాలని అడిగి ప్పుడు విచారణ సమయంలో చెప్పినట్లు వినకపోతే కేసు పెట్టి జైల్లో వేస్తా మని బెదిరించారు. ఇది ఎంత వరకు సబబు. అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నాను. న్యాయబద్ధంగా రావాల్సిందే అడుగున్నాను. నా భూమి నాకు అప్పగించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

**- బండ శ్రీశైలం, బాధితుడు, మర్యాల**



నారాయణగూడెంలో కుంపటి దీర్ఘకవిత ఆవిష్కరణలో జూలూరు గౌరీశంకర్

## బీసీ అస్తిత్వమే తెలుగు సాహిత్యానికి నజరానా

- తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ చైర్మన్ జూలూరు

మునగాల, అక్టోబర్ 6 : బీసీ ఆస్తిత్వానికి ఊపి రిలూదుతున్న కమ్మరి కొలిమి, కుమ్మరి చక్రం, సాలె మగ్గం, ఔసుల కుంపటి సహస్ర వృత్తుల జీవన గాథలే తెలుగు సాహిత్యానికి అసలైన చిహ్నా లని తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ చైర్మన్ జూలూ రు గౌరీ శంకర్ అన్నారు. మునగాల మండలం నారాయణగూడెం(తురకగూడెం)లో ఆదివారం గ్రామానికి చెందిన ప్రముఖ రచయిత బాణాల శ్రీనివాస్‌రావు రచించిన 'కుంపటి' దీర్ఘ కవితను గ్రామస్తుల సమక్షంలో పంచాయతీ కార్యాలయంలో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జూలూరు గొంతెత్తి చదవిన కవిత విన్న గ్రామస్తులు 50 ఏండ్ల నాటి సామా జిక పరిస్థితులు కండ్లకు కట్టినట్లు కుంపటిలో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఉప్పల యుగంధర్‌రెడ్డి, దేవినేని వీరభద్రరావు, గోపిరెడ్డి కోటిరెడ్డి, నాగిరెడ్డి, సూరగాని రాంబాబు, సోమి రెడ్డి వీరారెడ్డి, కాసాని వీరస్వామి, ప్రతాప్‌రెడ్డి, మిట్టగణపుల రామకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి వీల్ చైర్ బాస్కెట్‌బాల్ పోటీలకు సురేశ్



సురేశ్

తిరుమలగిరి(సాగర్), అక్టోబర్ 6 : ఈ నెల 9 నుంచి 13వరకు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియ ర్‌లో వీల్ చైర్ బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించే జాతీయ స్థాయి వీల్ చైర్ బాస్కెట్ బాల్ పోటీలకు తిరుమలగిరి మండలంలోని రంగుండ్ల గ్రామానికి చెందిన ధరావత్ సురేశ్‌నాయక్ ఎంపికయ్యారు. జూలై 25 నుంచి 27వరకు సౌత్‌జోన్ రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో ఆయన తెలంగాణ తరపున ఆడి జట్టు విజయం సాధించేలా కృషి చేయడంతో జాతీయ స్థాయికి ఎంపిక య్యాడు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సురేశ్‌నాయక్‌ను కుటుంబసభ్యులు, గ్రామ స్తులు అభినందించారు.